# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పునర్విభజన చట్టంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి పేరు చేర్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ❖ ఆంధ్రప్రదేశ్ ను ఎలక్ట్రానిక్ పవర్ హౌస్ గా మార్చేందుకు బాటలు వేస్తున్నామని మంత్రి నారా లోకేష్ అన్నారు.
- ❖ దేశంలో అన్ని గ్రామాలకు రహదారులు ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా తలసేమియా బాధితుల కోసం రక్తమార్పిడి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు.
- ❖ రాష్ట్రంలో వివిధ పోర్టుల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ మ్యారీ టైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పేర్కొన్నారు.

====================

పునర్విభజన చట్టంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని స్థానంలో అమరావతి పేరు చేర్చే ప్రతిపాదనకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ రోజు సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ వివరాలను రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధ సారధి పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. అమరావతి పేరును పునర్విభజన చట్టంలో చేర్చేలా చట్ట సవరణ చేయాలని మంత్రి మండలి సమావేశం తీర్మానం చేసిందని, ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపించనున్నట్లు మంత్రి తెలిపారు. రాజధాని పరిధిలో వివిధ సంస్థలకు, భూకేటాయింపులకు, మున్సిపల్ శాఖ 281 పనులను హైబ్రిడ్ యాన్యూటీ విధానంలో చేపట్టేందుకు ఆమోదం తెలిపిందని మంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 38 సెకన్లు)

====================

భారతీయులుగా అందరూ కలిసి కట్టుగా ఉండాల్సిన సమయమని, భారత సైన్యానికి అందరూ మద్దతుగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో నిర్ణయించినట్లు టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు కృష్ణదేవరాయలు తెలిపారు. ఢిల్లీలో ఈ రోజు జరిగిన అఖిలపక్ష సమావేశం అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా పాకిస్థాన్‌లోని 9 టెర్రరిస్టుల స్థావరాలపై భారత సేనలు విజయవంతంగా దాడి చేసిన తీరును కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్  సమావేశంలో వివరించారని తెలిపారు. పాకిస్తాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు వారికి ఆర్థికంగా అందుతున్న నిధులు, ప్రపంచ బ్యాంకుల నుంచి అందుతున్న సహాయం నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించామన్నారు. దాడుల అనంతరం సైన్యానికి చెందిన ఇద్దరు మహిళా అధికారులు దాడుల వివరాలను వెల్లడించిన అంశాన్ని అందరూ ప్రశంసించారని పేర్కొన్నారు.

====================

ఆంధ్రప్రదేశ్ ను ఎలక్ట్రానిక్ పవర్ హౌస్ గా మార్చేందుకు బాటలు వేస్తున్నామని రాష్ట్ర  ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. తిరుపతి జిల్లా శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడారు. ఆవిష్కరణ, పెట్టుబడి కలిసే చోట, భవిష్యత్ రూపుదిద్దుకుంటుందన్నారు. శ్రీ సిటీ పారిశ్రామిక పురోగతికి ఒక చుక్కానిలా మారిందని, ఎల్జీ ఎలక్ట్రానిక్స్  వంటి ప్రాజెక్టులతో రాష్ట్ర  భవిష్యత్‌ను నిర్మిస్తూ... స్మార్ట్ ఉద్యోగాలను సృష్టిస్తూ, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో తయారీ నుండి ప్రపంచం కోసం తయారీ వరకు ఆంధ్రప్రదేశ్ జైత్రయాత్ర కొనసాగుతుందని వ్యాఖ్యానించారు. రాబోయే 4 సంవత్సరాల్లో శ్రీ సిటీని తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంతో నేరుగా అనుసంధానం చేస్తామని మంత్రి లోకేశ్  తెలియజేస్తూ...

(వాయిస్ 38 సెకన్లు)

విరామం

====================

ప్రపంచ రెడ్‌క్రాస్, ప్రపంచ తలసేమియా దినోత్సవాలను పురస్కరించుకుని   ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఏర్పాటు చేసిన రక్తమార్పిడి కేంద్రాన్ని రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర రెడ్‌క్రాస్ అధ్యక్షులు అబ్దుల్ నజీర్ ఈ రోజు దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా తలసేమియా బాధితుల కోసం రక్తమార్పిడి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని  తెలిపారు. మెరుగైన వైద్య సేవలందక ప్రాణాలు కోల్పోతున్న వారికి ఈ కేంద్రాలు తోడ్పడతాయని అన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ శాఖ చేపడుతున్న సేవా కార్యక్రమాలను  జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షులు స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గవర్నర్ కు వివరించారు.

====================

తల్లీ, బిడ్డా క్షేమంగా ఉండేలా చూస్తూ... సహజ ప్రసవాలను పెంచడమే లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ఏర్పాటైన మంత్రసాని వ్యవస్థ మంచి ఫలితాలను ఇస్తోందని ఫెర్నాండెజ్ ఫౌండేషన్ సభ్యురాలు డాక్టర్ రాధా తెలిపారు. విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో యునిసెఫ్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ సంస్థలు ఈ రోజు సంయుక్తంగా ఈ వ్యవస్థపై కార్యశాలను నిర్వహించాయి. ఈ సందర్భంగా డాక్టర్ రాధా మాట్లాడుతూ... ఈ వ్యవస్థలో  శిక్షణ పొందిన నర్సులు... పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు ముందు నుంచే సహజ ప్రసవాలపై అవగాహన కల్పిస్తారన్నారు. యునిసెఫ్ ప్రతినిధి డాక్టర్ సలిమ మాట్లాడుతూ... సమర్థవంతమైన మంత్రసాని సేవల ద్వారా దేశంలో 83 శాతం మాత, నవజాత శిశు మరణాలను నివారించవచ్చని, 24 శాతం ముందస్తు జననాలను తగ్గించవచ్చని తెలిపారు. నర్సింగ్ పూర్తి చేసిన మహిళలకు ప్రభుత్వం  శిక్షణనిస్తోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

ఆంధ్రప్రదేశ్ లో వివిధ పోర్టుల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ మ్యారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పేర్కొన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో బందరు పోర్టు నిర్మాణ పనులను కలెక్టర్ డీ.కే బాలాజీ తో కలసి ఈ రోజు ఆయన పరిశీలించారు. బందరు పోర్టు మొదటి దశ పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా దామచర్ల సత్య మాట్లాడుతూ.. మాటూరు ప్రాంతంలో షిప్పు బిల్డింగ్ యూనిట్, దుగ్గరాజపట్నం పోర్టు సమీపాన షిప్పు బ్రేకింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని తెలిపారు. 2026, డిసెంబర్ నాటికి మొదటి దశ పోర్టు పనులను పూర్తి అవుతాయని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

====================

దేశంలో అన్ని గ్రామాలకు రహదారులు ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ రోజు శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం పరిధిలో మెలియాపుట్టి మండలంలో రహదారి నిర్మాణ  పనులకు కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... 2 కోట్ల 65 లక్షల రూపాయల ప్రధాన మంత్రి జన్మన్ పథకం నిధులతో ఈ రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

====================

====================